# సూర్య

17వ

ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా

సోమవారం,12 ఫిబ్రవరి 2024






## నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతిపాదనలు ఆమోదయోగ్యం కాదు

**హెచ్‌బిఐ వైస్ - చైర్మన్ డాక్టర్ సి.శ్రీనివాస రాజు**

**ఏలూరు,మేజర్‌న్యూస్:** హాస్పిటల్ ట్రీట్ మెంట్ చార్జీలకు సంబంధించి , నేషనల్ ఇన్సూ రెన్స్ కంపెనీ ప్రతిపాదించిన బొటా బొటీ ప్యాకేజీలకు , బిల్లు తగ్గింపులకు హాస్పిటల్ బోర్డు ఒప్పుకోదని ఐఎంఏ అనుబంధ సంస్థ హాస్పిటల్ బోర్డ్ ఆఫ్ ఇండియా (హెచ్‌బిఐ) వైస్ - చైర్మన్ డాక్టర్ సి.శ్రీనివాస రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఏ చికిత్సకు ఎంత ఖర్చు అవుతుంది? ఎంత కనీస చార్జీ లైతే హాస్పిటల్ మెయిన్ టైన్ అవుతుందో శాస్త్రీయబద్ధంగా తయారు చేసిన ట్రీట్ మెంట్ ధరలను ఆరోగ్యబీమా కంపెనీలు ఆమోదించేవరకు కాష్ లెస్ ట్రీట్ మెంట్‌కి హాస్పిటల్స్ అంగీకరించవని ఆయన వివరించారు.దీనికి సంబంధించి వివరణ ఇచ్చే వరకు హాస్పిటల్ బోర్డులో సభ్యులుగా ఉన్న అన్ని హాస్పిటల్స్ క్యాష్ లెస్ ట్రీట్ మెంట్ ఇచ్చే అగ్రిమెంట్‌ను ఆమోదించవని డాక్టర్ శ్రీనివాస రాజు పేర్కొన్నారు.

### బీసీలకు అన్ని రంగాలలో

# అగ్రస్థానం కల్పించిన ఏకైక సిఎం జగన్





**మంత్రి కారుమూరి, ఎంపీ బీదమస్తాన్‌రావు,మాజీ డిప్యూటీ సీఎం ఆళ్లనాని, అబ్బయ్య చౌదరి**

**ఏలూరు, మేజర్‌న్యూస్ :** బి.సి.,ల జాతి గౌరవాన్ని పెంచి, దేశ చరిత్రలో బి.సి లకు అన్ని రంగాలలో పెద్ద పీట వేసిన ఒకే ఒక ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి అని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి డా.కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. స్థానిక 32 డివిజన్ లో 14 లక్షల రూపాయలతో నిర్మించిన యాదవ సంక్షేమకమ్యూనిటీ హాలు ను ఆదివారం మంత్రినాగేశ్వరరావు రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్ రావు,జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, శాసనసభ్యులు ఆళ్ళనాని, కొఠారు అబ్బయ్య చౌదరి, ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూవెనుకబడిన తరగతుల సామజిక వర్గాలకు సామజిక, ఆర్ధిక,రాజకీయరంగాలలో సమున్నత స్థానం కల్పించినఘనతరాష్ట్ర ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. సంక్షేమం- అభివృద్ధికి సమాన ప్రాధాన్యతను ఇచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి నడిపిస్తున్నారని, ప్రభుత్వం చేపట్టిన పథకాలతో రాష్ట్రంలో పేదరికం 12 శాతం నుండి 6 శాతానికి తగ్గిందన్నారు. విద్యా, వైద్యం నకు ప్రాధాన్యత ఇచ్చి నాడు-నేడు కార్యక్రమం ద్వారా విద్యా, వైద్య రంగాలలో పలు సంస్కరణలు తీసుకువచ్చారని, విద్యలో దేశంలో ప్రధమ స్థానంలో ఉన్న కేరళ రాష్ట్రాన్ని దాటి మన రాష్ట్రం ప్రధమస్థానంలోఉందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా బాపూజీ కలలుకన్న గ్రామ స్వరాజ్య సాధనకు కృషి చేస్తున్నారని,ప్రజలవద్దకేపరిపాలన తీసుకువచ్చారన్నారు. దళారీల వ్యవస్థ లేకుండా రైతుల నుండి నేరుగా కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలుచేస్తున్నామన్నారు.

రాజ్యసభ సభ్యులు బీడా మస్తాన్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో సామాజిక న్యాయం చేస్తున్న ఆదర్శ నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వై. ఎస్. జగన్మోహన్ రెడ్డి అని, బిసిల అభివృద్ధి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. యాదవ సంక్షేమ కమ్యూనిటీ హాలులో మొదటి అంతస్తు నిర్మాణానికి 15లక్షల రూపాయలు, ఏలూరులో త్వరలో నిర్మించబోయే బిసిల సమీకృత కమ్యూనిటీ హాలు నిర్మాణానికి 25 లక్షల రూపాయలు ఎంపీ నియోజక వర్గ అభివృద్ధి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

ఏలూరు శాసనసభ్యులు ఆళ్ళ కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) మాట్లాడుతూ రాష్ట్ర ముఖమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల వారికి అన్ని రంగాలలో ప్రాధాన్యత ఇస్తున్నారని, బిసి.ల సంక్షేమానికి వేలాది కోట్ల రూపాయలతో పథకాలు అమలు చేస్తూనే, రాజకీయంగా వారికి అన్ని పదవులలో 50 శాతం కు పైగా సీట్లు కేటాయిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు బిసి. లను ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితంచేసి,వారి సంక్షేమాన్ని గాలికి ఒదిలేశాయన్నారు.దెందులూరు శాసనసభ్యులు కొఠారు అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ బి.సి ల సంక్షేమానికి కృషిచేస్తున్న నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి అని, బి.సి లకు సామజిక, ఆర్ధిక, రాజకీయ రంగాలలో సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఏలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నెరుసు చిరంజీవి యాదవ సంక్షేమ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి లక్ష రూపాయలు, కైకలూరు కు చెందిన శ్రీనివాస్ యాదవ్ లక్షా ఒకవెయ్యినూట పదహారు రూపాయలు విరాళంగా అందించారు.

కార్యక్రమంలో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ , ఇడా చైర్మన్ బొద్దానిశ్రీనివాస్,డిప్యూటీ మేయర్లు నూకపెయ్యి సుధీర్ బాబు, గుడిదేసి శ్రీనివాసరావు, కో-ఆప్షన్ సభ్యులు ఎస్.ఎం.ఆర్. పెదబాబు, రాష్ట్ర సాహిత్య మండలి చైర్ పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, టిటిడి బోర్డు మెంబెర్ నెరుసు నాగసత్యం యాదవ్,కారుమూరిసునీల్‌యాదవ్, పలువురు యాదవ సంఘనాయకులు ,ప్రభృతులు పాల్గొన్నారు.



( ఫైల్ ఫోటో )

### పాలకొల్లు వైసీపీలో

# ఆధిపత్య పోరు?

**పాలకొల్లు, మేజర్‌న్యూస్:** పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గంలో అధికార వైసీపీ పార్టీలో రోజురోజుకీ ఆధి పత్య పోరు నెలకొంటోంది. ఇటీవల అనేక కార్యక్రమాలకు సీనియర్ వైసీపీ నాయకులు అలకపూని పలు అభివృద్ధి కార్యక్రమాలకు గైర్హాజరు కావడంతో రాజకీయాలకు కొత్తగా వచ్చిన పాలకొల్లు నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జ్ గుడాల గోపికి తలనొప్పిగా మారినట్లు సమాచారం. సమావేశాల్లో కొన్ని సందర్భాలలో మైకుల్లో మాట్లాడుతూ కొందరు నాయకులు మధ్యలో వెళ్లిపోవడం, వారిని బ్రతిమలాడి బుజ్జగించి తీసుకురావడం పరిపాటిగా మారింది.

యలమంచిలి మండలం, వైసీపీ క్యాడర్‌కు ప్రాధాన్యత ఎక్కువ ఇస్తున్నారని పాలకొల్లు మండలం నాయకులు అలక చెందుతున్నారు, పట్టణంలో నామినేటెడ్ పదవులను అప్పటి ఇన్చార్జి కవురు శ్రీనివాసు నియమించటం, ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా కాలపరిమితి అయిన తర్వాత వేరే కొత్త వారికి నియమించడం, మండల వైసీపీ కన్వీనర్లను మార్చడంతో పార్టీకి దూరంగా ఉంటున్నారు, టీటీడీ బోర్డు సభ్యులు మేకా శేషుబాబు వైసిపి పార్టీ కార్యక్రమాలకు హాజరు కాకపోవడం, వేదిక పైకి చోటా నాయకులు తప్ప సీనియర్ నాయకులు కరువయ్యారు, దూరంగా ఉంటున్నారు. గుడాలగోపిని రాజకీయ అభిమన్యుని చేస్తారా? అనే అనుమానం పలువురులో కలుగుతోంది.


## ఏలూరులో యాదవ సంఘ భవనానికి బూరుబోయిన రూ.1 లక్ష విరాళం



**కైకలూరు,మేజర్ న్యూస్:**ఏలూరులో నూతనంగా నిర్మించినటువంటి జిల్లా యాదవ సంఘం భవనానికి ప్రజా సేవకుడు దినేష్ ఇన్ ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్, బిఎస్సార్ ఆక్వా ట్రేడర్స్ అధినేత బూరుబోయిన శ్రీనివాసరావు రూ 1లక్ష11వేల116లు విరాళంఇచ్చారు.నూతనంగా నిర్మించినటువంటి యాదవ సంఘం భవన ప్రారంభోత్సవంలో బి ఎస్ ఆర్ పాల్గొని ముఖ్య అతిథులుగా ఉన్న పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వర రావు, ఏలూరు ఎమ్మెల్యే నాని, ఎంపీ బీదా మస్తాన్ రావు, దెందులూరు ఎమ్మెల్యే అబ్బాయి చౌదరి, వైసిపి ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ సమక్షంలో సంఘ భవనానికి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా బి ఎస్ ఆర్ మాట్లాడుతూ సంఘానికి గాని పేద ప్రజలకు గాని ఎప్పుడు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇంత పెద్ద ఎత్తున విరాళం ఇచ్చిన బోరు బోయిన శ్రీనివాసరావుని సంఘ నాయకులు అభినందించారు.

కార్యక్రమంలో బుర్ల పోతురాజు, చావల రజనీకాంత్, బోడావుల రాజు, మాడపాటి నాగ శ్రీను, బోయిన రాజేష్, తలారి సురేష్, గంగుల నరసింహస్వామి,బోయిన శివాజీ, బోడావుల ప్రభాస్ బాబు, నాగన బోయిన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జనసేనలో చేరిన 150 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు





**పెంటపాడు, మేజర్‌న్యూస్:** పెంటపాడు మండలం కోరుమిల్లి గ్రామం నుండి జనసేన పార్టీ చేసే సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై వైయస్సార్సీ పార్టీకి చెందిన సుమారు 150 మంది కార్యకర్తలు జనసేన పార్టీ లైజనింగ్ సభ్యులు లింగం శ్రీను ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం జనసేన పార్టీ ఇంచార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. తాడేపల్లిగూడెం మండలం కృష్ణాపురంలో జనసేన పల్లె పోరులో భాగంగా జనసేన పార్టీ ఇంచార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్ పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఏ పల్లెకు వెళ్లిన త్రాగునీరు డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని కలుషిత నీరు త్రాగి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని ఇవన్నీ గాలికి వదిలి ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మరియు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ప్రజల సొమ్ముతో సిద్ధమనే కార్యక్రమాల్ని చేస్తూ కోట్లాది రూపాయల ప్రజల సొమ్మును నాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు .సిద్ధం అనే కార్యక్రమానికి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని ఆడబ్బుతో రాష్ట్రంలో రహదారులు వేస్తే బాగుంటుందని మట్టి దోచుకుంటున్నారు. కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలను కూడా తీస్తున్నారు.అందుకే ఈ వైయస్ జగన్మోహన్ రెడ్డిని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ను ఇంటికి సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీ విజయం సాధిస్తుందని ప్రజల కష్టాలు తీరుస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గం జనసేన నాయకులు జన సైనికులు వీర మహిళలు పాల్గొన్నారు.

# బీసీలు ఐక్యంగా ఉండాలి






**- ఎన్నికల్లో వారి గెలుపు కోసం కృషి చేయాలి**

**- మంత్రి కారుమూరి,వీరవల్లి,పాకా, నేతల పిలుపు**

**తాడేపల్లిగూడెం, మేజర్‌న్యూస్ :** వెనుకబడిన తరగతులకు చెందిన కులస్తులందరూ ఏకమైనప్పుడే మన స్వచ్ఛమైన కోరికలు సాధించ గలుగుతాం.బీసీలంతాఏకమైనప్పుడే రాజ్యాధికారం సాధ్యమవుతుందని, పార్టీలకు అతీతంగా అభ్యర్థులను గెలుపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీసీ బహిరంగ సభలో వక్తలు పిలుపునిచ్చారు. పెడతాడేపల్లి వద్ద జాతీయ రహదారి పక్కన బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీసీ బహిరంగ సభ ఆదివారం జరిగింది. సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయంగా బీసీలకు అధిక ప్రాముఖ్యతఉందని,వారినిగెలుపించుకుంటే బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందుతాయన్నారు. బీసీల్లో ఐక్యత లోపిస్తే మనమందరం నష్టపోతామన్నారు.ఏ రాజకీయ పార్టీ తరఫునైనా ఒక బీసీ నాయకుడు పోటీ చేస్తే బీసీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు.బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ పాకా సత్యనారాయణ మాట్లాడుతూబీసీల్లోఎన్నో ఉపకులాలుఉన్నాయని ఆయా కుల వృత్తులను అందరూ గౌరవించాలన్నారు. నరసాపురం వైసిపి ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ బీసీలకు అవకాశం ఇచ్చినప్పుడే గెలుపించుకోవాలని కోరారు. గతంలో ఎంతో మంది బీసీలకు సీట్లు ఇచ్చినప్పటికి ఐక్యత లేకపోవడంతో ఓటమి చెందారని గుర్తు చేశారు. తెదేపా మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి అభ్యర్థులను నిర్దేశించే స్థాయి బీసీలకు ఉందన్నారు. బీసీల సామాజిక న్యాయం కోసం పార్టీలు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాసరావు మాట్లాడుతూ బీసీల ఐక్యతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీలకు అతీతంగా సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు మెంబరు మేకా శేషుబాబు,ఎపి ఎంబిసి కార్పోరేషన్ చైర్మన్ పెంద్ర వీరన్న,టిడిపి నాయకుడు పితాని వెంకట్,అంతర్జాతీయ మహిళా శిల్పి దేవికారాణి ఉడయార్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దింట్లమ్మ వారధి ప్రారంభం





**అతిథులుగా హాజరైన మంత్రి కారుమూరి, ఎమ్మెల్యే డిఎన్ఆర్,ఎమ్మెల్సీ జయమంగళ**

**కైకలూరు, మేజర్‌న్యూస్ :** కైకలూరు మండలం కొల్లేరు ప్రజల చిరకాలస్వప్నంఈవారధి,అటువంటిఈవారధియొక్క నిర్మాణమునకు గత ప్రభుత్వములు పట్టించుకున్న దాకలాలు లేవు మన వైయస్ఆర్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే డిఎన్ఆర్ ప్రత్యేకచొరవతో 14.70కోట్లనిధులతో నిర్మాణం పూర్తిచేసి ఈరోజు శ్రీ పేదింట్లమ్మ వారధి ప్రారంభించి, శిలాఫలకంఆవిష్కరించారు.కొల్లేరు వాసులకు వారధిని అందించటం చాలా ఆనందంగా ఉన్నదని, ఇంతటి అభివృద్ధికి మూలకారణమైన ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణను దుశ్శాలువలతో సత్కరించి, కొల్లేరు ప్రాంత అభివృద్ధి కొరకు నావంతుగాసహాయసహకారాలు అందిస్తాననిరాష్ట్రపౌర సరఫరాల శాఖమంత్రికారుమూరి వెంకటనాగేశ్వరరావు పేర్కొన్నారు. కొల్లేరు వాసులకు ఇది ఒక పండుగ లాంటి కార్యక్రమం, గత ప్రభుత్వలలో కేవలం పునాదులు మాత్రమే వేసి వదిలేస్తే కొల్లేరు ప్రాంత అభివృద్ధి కొరకు ఈ వారధి ఎంతగానో తోడ్పడుతుందని ముఖ్యమంత్రి జగన్‌కి తెలుపగా వారు వెంటనే నిర్మించాటానికి, అలాగే క్రితం పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టర్ బిల్స్ కూడా చెల్లించటానికి తోడ్పడిన జగన్‌కి, మీ తరుపున, నా తరుపున, వైయస్ఆర్ కుటుంబ సభ్యులు తరపున ప్రత్యేక ధన్యవాదములని శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు పేర్కొన్నారు.

అలాగే కొల్లేటికోట శ్రీ పెద్దింట్లమ్మ అమ్మవారిఆలయముందర దాతలసాయంతో నిర్మితమైన ముఖద్వారంముఖమండపం మరియు అని వేటి మండపం కార్యక్రమంలో పాల్గొని రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభించిశిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కొల్లేటికోట గ్రామ ప్రజల ఆరాధ్య దైవం శ్రీ పెద్దింట్లమ్మ అమ్మవారి ముఖ ద్వారం ప్రారంభించటం నా అదృష్టమని, ఈ అని వేటి మండపం రూపకర్త డిఎన్ఆర్ అని అభినందించాలని కారుమూరి నాగేశ్వరావు పేర్కొన్నారు. అనంతరం స్థల దాతలకుఅమ్మవారికి మూలధనంసమర్పించిన వారికి, దుస్సాల్వాలు కప్పి సత్కరించారు. తొలిత ఆలయ కార్య నిర్వహణ అధికారి గోపాలరావు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు స్వాగతంతో అమ్మవారి దర్శించి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సభలో పాల్గొన్నారు.ఈకార్యక్రమంలోఎంపీపీఅడవి వెంకటకృష్ణ, జడ్పిటిసి కురెళ్ళ బేబీ,,గ్రామ సర్పంచ్‌సముద్రుడు,కొయ్యే గంగయ్య, మేరీనవరత్నకుమారి,ఆలయచైర్మన్‌పులవర్తి లక్ష్మణరావు, ఆలయ ధర్మకర్తల మండలి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### లోకేష్ శంఖారావం విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు



**మొగల్తూరు, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టే శంఖారావం జయప్రదం కావాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ, జనసేన ఆధ్వర్యంలో మొగల్తూరు మండలం ముత్యాలపల్లి లో ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నరసాపురం నియోజకవర్గం ఇంచార్జ్ పొత్తూరి రామరాజుముఖ్యఅతిథిగాపాల్గొని మాట్లాడారు. 'శంఖారావం' కార్యక్రమంతో మళ్లీ ప్రజల్లోకి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి120 అసెంబ్లీ నియోజకవర్గాల్లో శంఖారావం పేరుతో పర్యటన - ప్రతిరోజు 3 నియోజకవర్గాల్లో పర్యటించనున్న తెలిపారు. శ్రీకాకుళంలోని ఇచ్చాపురం నుంచి ప్రారంభం కానున్న శంఖారావంరాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, వైసీపీ నాయకుల అరాచకాలను ఎండగడుతూ లోకేష్ శంఖారావం ప్రారంభమైందని, ఈ కార్యక్రమంతో అధికార పార్టీ అడ్రస్ గల్లంతని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొప్పాడి రవీంద్ర నాథ్ రాగూర్జోగి వెంకటరాధా కృష్ణ,వాతాడి ఉమా,అందే రామకృష్ణ, కొల్లు పెద్దిరాజు, కొల్లటి పెంటయ్య,దొంగ శ్రీను,అడ్డాల సూరిబాబు, కవురు నాగేశ్వరావు, కొల్లాటి బుల్లబ్బాయి,దొంగ ఏడుకొం డలు,వాటాల శ్రీను,కొల్లటి అర్జున్ రావు,కొల్లటి భోగరాజు,బందన విజయకుమార్, నాగిడి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## కుక్కునూరు మండలం అభివృద్ధికి కృషి

**బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,తపన ఫౌండేషన్ అధినేత 'గారపాటి'**



**కుక్కునూరు,మేజర్‌న్యూస్ :** భారతీయ జనతా పార్టీ తలపెట్టిన గావ్ చెలో కార్యక్రమానికి హాజరైన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారాపాటి సీతారామంజనేయచౌదరిపల్లెకు పోదాం కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించుకుని,రెండవ రోజు కుక్కునూరు మండలంలో గల బీజేపీ పార్టీ కార్యాలయంలో తపన ఫౌండేషన్ ప్రతినిధులసమావేశంలోపాల్గొన్నారు.ఈసందర్భంగాఆయన మాట్లాడుతూ, సమాజానికి సేవ చేయాలనే తపనతో,తపన ఫౌండేషన్ స్థాపించి నేటికి పదిహేను సంవత్సరాల అవుతుందని,ఫౌండేషన్ ద్వారా మహిళల ఆర్థిక బలోపేతానికి కుట్టు శిక్షణా కేంద్రాలు,మంచినీటి సౌకర్యం,విద్య, వైద్యం,వ్యక్తిత్వ వికాసం వంటి అనేక సహాయ కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు.యువకుల్లో,ఉన్నతచదువులుచదివినవిద్యార్థుల్లో ప్రతిభనువెలికితీసేందుకుఏలూరులో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని అన్నారు.రానున్న రోజుల్లోఅందరిఆశీర్వాదంతోకుక్కునూరు మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తూ,సేవ చేయటానికి మీ ముందుకు వస్తానని అందుకు మీ అందరి సహకారం కావాలని కోరారు.ఈ సమావేశానికి 22 గ్రామాల నుంచి 52 మంది ప్రతిని ధులు హాజరైయ్యారని తపన ఫౌండేషన్ ఇంచార్జి గంగాదరి రామకృష్ణ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొడియం శ్రీనివాసరావు,మండల గౌరవ అధ్యక్షులు వల్లాల రాధాకృష్ణ, బీజేపీ మండలపార్టీఅధ్యక్షులు తూము వెంకన్న,ఉపాధ్యక్షులు దుద్దుకూరి కృష్ణార్జునరావు,మండల ప్రధానకార్యదర్శి వెలకంబాలక్రిష్ణ,మైసాక్షిరాము,యువ మోర్చా అధ్యక్షులు బిక్షాచారి,ఎస్టీ మోర్చా అధ్యక్షులు సున్నం మహేష్,చింతా భాస్కర్,కునవరపువెంకన్న,కండ్రశ్రీను,వేముల శేషు, జిల్లాబీసీనాయకులు విరాచారి, నరేష్,ముత్తవరపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్న వెంకన్నను దర్శించుకున్న ప్రభుత్వ సలహాదారు తిరుపాల్ రెడ్డి



**ద్వారక తిరుమల,మేజర్‌న్యూస్ :** ఏలూరు జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకా తిరుమల చిన్న వెంకన్నను ప్రభుత్వ సలహాదారు (వ్యవసాయం) ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి దర్శించుకున్నారు.

ఆదివారం ఆలయానికి విచ్చేసిన ప్రభుత్వ సలహాదారు (వ్యవసాయం) ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డిని ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ప్రభుత్వ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి స్వామివారి బంగారు వాకిలి గుండా ప్రదక్షిణ చేసి అమ్మవార్లను స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు శేష వస్త్రం కప్పి వేద ఆశీర్వచనం పలికారు. అనంతరం స్వామివారి జ్ఞాపికను కలెక్టర్‌కు ఆలయ ఏఈవో మెట్టపల్లి దుర్గారావు అందజేశారు.

## పవన్ కళ్యాణ్ సభకి స్థల పరిశీలన



భీమడోలు, మేజర్ న్యూస్: ఉంగుటూరు నియోజవర్గం పరిధిలో మరికొద్ది రోజుల్లో జరగనున్న జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ బహిరంగ సభకి ఈ రోజు భీమడోలు, గణపవరంలో సభ స్థలాన్ని, హెలిపాడ్‌ని ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ పత్సమట్ల ధర్మరాజు పరిశీలించారు. ఆయనతో పాటు పశ్చిమ గోదావరి జిల్లా జోన్ 2 కమిటీ కో కన్వీనర్ చిక్కాల వేణు ,ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు తోట పవన్, అనిల్ కుమార్ , భీమడోలు మండలం జనసేన పార్టీ అధ్యక్షులు ప్రత్తి మధన్,జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

## దైవ నామస్మరణలతో మారుమోగిన వాసవి మాత ఆలయం

**పట్టణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని దైవ కార్యక్రమం చేస్తున్నాం : మారం వెంకటేశ్వరరావు**





**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్:** దైవ నామస్మరణలతో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రం మారుమోగింది. మాఘ మాసం మొదటివారం కావడంతో సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా 108 కళాశాలతో ఆలయ ప్రదక్షణ కొనసాగిన తర్వాత పంచామృతాలు, వివిధ ఫల రసాలు, సుగంధ ద్రవ్యాలతో వాసవి మాతకు అభిషేకాలు నిర్వహించారు. వాసవి మాత ఆలయ ప్రాంగణంలో నిర్మించిన 27 అడుగుల అభయ ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట విగ్రహ దాతలు లక్ష్మి మాటూరి వెంకటేశ్వరరావు జయ శ్రీ దంపతులచే రామకృష్ణ శర్మ మరియు 11 మంది వేద పండితులచే నవగ్రహ మండపారాధన, అగ్ని హోమములు, కుంభం, రక్షాబంధనం పూజ పూర్ణాహుతి కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం సుమారు 6000 మందికి అన్న సమారాధన నిర్వహించారు. మధ్యాహ్నం హనుమాన్ చాలీసా పారాయణం 108 సార్లు సాయంత్రం వరకు కొనసాగింది. ముందుగా అభయాంజనేయ స్వామి 27 అడుగుల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా విశేష పూజలు హోమాలు తెల్లవారు జామునుండే మొదలయ్యాయి. పూజ కార్యక్రమంలో కూర్చు న్న దంపతులను పోలీస్ ఐలాండ్ నుండి ఊరేగింపుగా బాణాసంచాతో ఆలయప్రాంగణమునకు తీసుకు రావడం జరిగింది. ఈ కార్యక్రమం ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు మారం వెంకటేశ్వ రావు, పూర్వాధ్యక్షులు ఓబిలి శెట్టి నటరాజు, తాడేపల్లిగూడెం శ్రీ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులు కొల్లేకర రాము, కార్యదర్శి నున్న సుందరం, కోశాధికారి భోగవల్లి రమేష్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగినది, 2024–27 సంవత్సరములకు నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగినది. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు కోన శ్రీనివాసరావు, రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు కొనకల్లా హరినాథ్, ప్రపంచ ఆర్యవైశ్య మహా రాష్ట్ర అధ్యక్షులు సమయమంతుల హేమ సుందర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంకు పూర్వాధ్యక్షులు గమిని సుబ్బారావు, కోన శ్రీనివాస్, గ్రంధి సత్యనారాయణ, పేరూరు కాశియ్యా, మండవల్లి నాగేందర్ రావు తదితరులు పాల్గొన్నారు,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తాడేపల్లిగూడెం జనసేన ఇంచార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్, తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వలవల బాబ్జి, అప్పడ వైస్ చైర్మన్ క్యాబినెట్ మినిస్టర్ వడ్డి రఘురామనాయుడు, యెగ్గిన నాగబాబు, గుండుబోగుల బలుసులరావు, గుండు బోగుల సాంబయ్య, దాట్ల జగన్నాథరాజు, అనేకమంది రాజకీయ నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు నున్న ఆనంద్ సెక్రటరీ గుప్తా ట్రెజరర్ రంగ వనితా క్లబ్ ప్రెసిడెంట్ స్వర్ణ సెక్రటరీ రాణి వాసవి క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్లనున్న నాగలక్ష్మి ఆర్యవైశ్య మహిళా సంఘం ప్రెసిడెంట్ కొండూరి దుర్గ, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళా సంఘం సభ్యులు, వనిత క్లబ్ సభ్యులు వాసవి క్లబ్ సభ్యులు, ప్రపంచ ఆర్యవైశ్య సంఘం సభ్యులు అనేకమంది పాల్గొని ఈ కార్యక్రమం జయప్రదం చేశారు.

## సమస్యపై వెళ్తే జనసేన కండువా కప్పారు



**నర్సాపురం రూరల్, మేజర్‌న్యూస్:** మండలంలోని వేములదీవి వెస్ట్ సర్దుకొడపకు చెందిన కొందరు వ్యక్తులు ఒక సమస్యపై ఈనెల 9వ తేదీన జనసేన పార్టీ కార్యాలయానికి వెళ్ళగా తమ ప్రమేయం లేకుండా జనసేన కండువా కప్పారని, ఆ పార్టీలో చేరినట్టు పత్రికలలో ప్రకటన ఇచ్చుకున్నారని వైసీపీ కార్యకర్తలు వాపోయారు. ఆదివారం రాత్రి రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తిరుమాణి నాగరాజు నివాసంలో వారు విలేకరులతో మాట్లాడారు. మేము ఇప్పటికీ వైసీపీ పార్టీలోనే ఉన్నామని. జగన్మోహన్ రెడ్డి వెంటే ఉంటామని అన్నారు. ఈ సందర్భంగా తిరుమాణి నాగరాజు మాట్లాడుతూ జనసేన నాయకుడు నాయకర్ ఇదే పనిగా పెట్టుకుని సమస్యపై వెళ్లే వారికి జనసేన కండువాలు కప్పుతున్నారని అన్నారు.

కేవలం అగ్నికుల క్షత్రియులను టార్గెట్‌గా చేసుకుని చౌకబారు రాజకీయాలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో అనేక కులాలు ఉండగా అగ్నికుల క్షత్రియులను తన అవసరాల కోసం వాడుకుంటున్నారు అని అన్నారు. అగ్నికుల క్షత్రియులంతా వైసీపీ తోనే ఉన్నారని నాగరాజు అన్నారు. బొమ్మిడి రమేష్, ఒ డుగు రామకృష్ణ, ఒడుగు శ్రీనివాస్, వల్లబోయిన సుబ్రహ్మణ్యం, ఒ డుగు నాగరాజు, ఒ డుగు నరసింహ స్వామి తదితరులుమాట్లాడారు. ఇదే విషయమై జనసేన ఇన్చార్జి బొమ్మిడి నాయకర్ సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

## ఎన్నికల ప్రచారానికి సిద్ధమైన జనసేన వాహనం



**నర్సాపురం,మేజర్‌న్యూస్:** ఎన్నికల షెడ్యూల్ రాకముందే ప్రచారానికి వాహనాలను పార్టీల అభ్యర్థులు సిద్ధం చేసుకుంటున్నారు. తెలుగుదేశం, జనసేన, బిజెపి రాబోయే ఎన్నికలలో ఉమ్మడిగా పోటీ చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటున్నాయి. నర్సాపురం అసెంబ్లీ టికెట్ ఏ పార్టీకి లభిస్తుందో అన్న విషయం ఇంకా ఆ పార్టీల అధిష్టానాలు తేల్చి చెప్పలేదు. అయినప్పటికీ జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బొమ్మిడి నాయకర్ గడచిన ఎన్నికలలో స్వల్ప ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. ఈ ఎన్నికలలో తనకే సీటు వస్తుందని ఇప్పటికే నియోజకవర్గమంతా పర్యటించి చెప్పుకున్నారు. ఈ నేపథ్యంలో నరసాపురం అసెంబ్లీ అభ్యర్థిగా నాయకర్ కు గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేయాలని వాహనాన్ని సిద్ధం చేశారు. భీమవరంలో ఈ వాహనం తుదిమెరుగులు దిద్దుకుంటుంది. జనసేన నాయకులు కార్యకర్తలు ఎన్నికల వాహనం తయారవుతూ ఉండటంతో ఆనందంలో మునిగితేలుతున్నారు. ఇదిలా ఉండగా ఉమ్మడి అభ్యర్థిగా పార్టీ అధిష్టానాలు ఎవరి పేరు ప్రకటించకుండా వాహనం సిద్ధం చేసుకోవటం చేసుకోవటం సరియైన పద్ధతి కాదని తెలుగుదేశం బిజెపి నేతలు మండిపడుతున్నారు. మరి కొద్ది రోజుల్లో నరసాపురం అసెంబ్లీ అభ్యర్థి ఎవరు అనేది పార్టీ అధిష్టానాలు ప్రకటించనున్నాయి.

## గ్లోబల్ లీడర్ ప్రధాని నరేంద్ర మోడీ

**పల్లెకు పోదాంలో బిజెపి ఉపాధ్యక్షుడు 'నరిసే'**



**పెంటపాడు,మేజర్‌న్యూస్:** పెంటపాడు మండలం రావిపాడు గ్రామములో పల్లెకు పోదాం (గావ్ చలో అభియాన్) కార్యక్రమములో బిజెపి జిల్లా మాజీ ఉపాధ్యక్ష్యులు నరిశే సోమేశ్వరరావు ప్రవాస్ గా వెళ్లి జండా ఆవిష్కరణ చేసి గోడలపై ఆంధ్రాలో ఒకసారి కేంద్రములో మూడో సారి బిజెపి ప్రభుత్వం రావాలని కోరుతూ గోడలపై పెయింటింగ్ చేశారు. నరిశే సోమేశ్వరరావు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రధాని మంత్రి అయినప్పటి నుండీ దేశములో అనేక మార్పులకు శ్రీకారం చుట్టారని సంక్షేమం అభివృద్ధి రెండు రెండు కళ్లుగా చూసుకున్నారని అయోధ్యలో భవ్య రామ మందిరం ఏర్పాటు తర్వాత ప్రతిపక్షాలకు మాటలు ఏమి లేవని కేంద్రములో మూడో సారి బిజెపి ప్రభుత్వం 400 సీట్లు తో ఏర్పాటు చేసి ప్రజలు ఎన్నో సంక్షేమాలతో పాటు దేశ భద్రత లో ప్రపంచానికి ఆదర్శం గా ఉంటూ గ్లోబల్ లీడర్ గా నరేంద్ర మోడీజీ ఉన్నారని తెలిపారు. గ్రామ పెద్దలు పెన్నాడ సూరిబాబు ,మూలగాల బాబ్జి తదితర పెద్దలను కలిసి నరేంద్ర మోడీజీ చేస్తున్న అనేక సంక్షేమ కార్యక్రమాలకు మద్దతుగా పోస్ట్ కార్డు ద్వారా ధన్యవాదాలు తెలపాలని కోరారు. బిజెపి పెంటపాడు మండల కార్యదర్శి తోట రామచంద్రరావు సహకారంతో ఇంటి ఇంటికి పల్లెకు పోదాం కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమములో బిజెపి నాయకులు రామగాని సత్యనారాయణ, అయనం బాలకృష్ణ, ఇమ్మంది శ్రీను, కోరుమిల్లి శ్రీను ,మారిశెట్టి నరసింహ మూర్తి, ఓబీసీ నాయకులు వెంకటేశ్వరావు,బెనర్జీ చేవూరి గంగాధరావు తదితరులు పాలుగోన్నారు

## తాడేపల్లిగూడెంలో యువకుడి ఆత్మహత్య

**ఫైనాన్స్ వారి వేధింపులే మృతికి కారణంగా చెబుతున్న బంధువులు మిత్రులు**






**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్:** తాడేపల్లిగూడెంకు చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిపాయిపేట ఈ రోజు చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే సిపాయి పేటకు చెందిన ముత్యాల పవన్ కుమార్ 2022 సంవత్సరంలో షిఫ్ట్ డిజైర్ కారు ఫైనాన్స్లో కొనుగోలు చేసుకున్నాడు. మొదట్లో కిరాయిలు బాగుం డడంతో ఫైనాన్స్ సక్రమంగానే కడుతూ వచ్చాడు. కానీ కారుకు కిరాయి లు సరిగా లేకపోవడంతో గత రెండు నెలలుగా ఫైనాన్స్ కట్టలేకపోయాడు. ఫైనాన్స్ కంపెనీ వాళ్లు పవన్ కుమార్ ను డబ్బులు కట్టమని ఒత్తిడి చేయడం మొదలుపెట్టారు. ఫైనాన్స్ డబ్బులు కట్టడానికి అన్ని విదాల ప్రయత్నం చేసి చివరికి కట్టే పరిస్థితి లేకపోవడంతో పవన్ గుర్తింపు లోని రోడ్ నెంబర్ ఫైవ్ లో ఇంట్లో గాలి పంకాకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని కిందికి దింపి కేసు నమోదు చేసి శవ పంచనామా నిమిత్తం మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## అలరించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**మండవల్లి, మేజర్ న్యూస్:**మండవల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో 2003–04 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు 20 సంవత్సరాల అనంతరం ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండవల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఆదివారం వేదికగా మారింది. గురువులు ఎం.ఎస్.ఎస్ కుమార్, జానకి రామారావు, కొండయ్య, పి.వెంకటేశ్వరరావు, మురళీకృష్ణ, పి ఈ టి విజయ్, రామారావు, రత్న కుమారు, సుబ్రహ్మణ్యం, నజీరున్నీసా బేగం, కరుణ, మహాలక్ష్మి లను శాలువాలు కప్పి, మెమొంటోలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ 20 స.ల క్రితం విద్య, బుద్ధులను నేర్పిన గురువులను గుర్తించుకొని సాదరంగా ఆహ్వానించి సత్కరించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. చనిపోయిన గురువులకు, విద్యార్థులకు నివాళులు అర్పించారు. ఇక నుంచి టచ్‌లో ఉండాలంటూ ఫోన్ నంబర్లు తీసుకోవడంతో పాటు ఈ మధుర జ్ఞాపకాలను తమతమ సెల్‌ఫోన్లలో బంధించుకున్నారు. అందరిచిరునామాలు సేకరించి ఒకేచోట కలుసుకోవడానికి గుడివాడ గణేష్,చొప్పరపు విజయ్, గోనుగుంట మోహన రంగ,డి.కుసుమ కుమార్, జి.సతీష్,కె.వెం కటేశ్వరరావు మరియు టీంవర్క్‌గా కష్టపడిన విద్యార్థిని విద్యార్థులను అభినందించారు.

## థైరాయిడ్ రోగికి చేయూత



**భీమడోలు, మేజర్‌న్యూస్ :**భీమడోలు మండలం అంబరుపేట గ్రామంలో కట్టుబోయిన రాంబాబు కుమారుడు వీర బాలాజీ అనే అబ్బాయి గత తొమ్మిది సంవత్సరాల నుంచి థైరాయిడ్ సమస్యతో బాధపడుతున్నాడు ఈ విషయం తెలుసుకున్న జిల్లా వికలాంగులు హక్కుల పోరాట సమితి అధ్యక్షులు మామిడిపల్లి నాగభూషణం ఆ కుటుంబాన్ని పరామర్శించి మేము ఉన్నామని భరోసా ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో కనుమూరి లీలా కృష్ణ, నక్క రాము , ముక్కెళ్ళ రాంబాబుచేబోయిన నాగేశ్వరరావు, షేక్ బాజీ ముల్లపూడి సత్యనారాయణ , ఎం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ అభివృద్ధి లక్ష్యంగా మోడీ పాలన

**బిజెపి నేత ఉన్నమట్ల కబర్థి**



**పాలకొల్లు,మేజర్‌న్యూస్:**గ్రామీణ అభివృద్ధి లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పథకాలు రూపొందించి అమలు చేస్తూ వచ్చారని బిజెపి కృష్ణాజిల్లా ఇన్చార్జి, పాలకొల్లు ఏఎంసీ మాజీ చైర్మన్ ఉన్నమట్ల కబర్థి అన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపు మేరకు ఆయన ఆదివారం గావ్ చలో అభియాన్ (పల్లెకు పోదాం) కార్యక్రమంలో భాగంగా స్వగ్రామమైన కొంతేరులో పర్యటించారు. ముందుగా భారతీయ జన సంఘం ఏకాత్మత మానవతా సిద్ధాంతకర్త దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం గ్రామములోని బూత్ కమిటీల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కబర్థి మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించిన బిజెపికి ఉపాధ్యాయ పటిష్ట పునాదులు వేశారని గుర్తు చేశారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ సుపరిపాలన అందిస్తున్నారని గర్వంగా చెప్పారు. ప్రపంచ దేశాల్లో భారతదేశాన్ని ఐదవ ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దారని, అభివృద్ధి చెందిన దేశంగా చేయాలనే లక్ష్యంతో పాలన సాగిస్తున్నారని వెల్లడించారు. అందులో భాగంగానే గ్రామీణ అభివృద్ధికి పెద్దపీట వేశారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో బిజెపి యలమంచిలి మండల అధ్యక్షులు దొంగ నరసింహ కుమార్, మండల నాయకులు జడ్డు రామకృష్ణ, పిల్లా విజయ గోపాలకృష్ణ, గ్రామంలోని బూత్ కమిటీ అధ్యక్షులు వెన్న సత్తిబాబు, పిన్నం రెడ్డి శ్రీనివాస రావు, బొక్కా నాగమణికంఠ లు పాల్గొన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

## కేంద్రంలో మూడోసారి బిజెపి రావటం ఖాయం





**ఏలూరు బిజెపి ఎంపీ అభ్యర్థి గారపాటి గెలిస్తే డబుల్ ఇంజన్ అభివృద్ధి**

**కైకలూరు, మేజర్‌న్యూస్:** కేంద్రంలో మూడోసారి మోడీ ప్రధాని కావడం ఖాయమని ఏలూరు జిల్లా అభివృద్ధికి ఎంపీ అభ్యర్థి గారపాటి చౌదరినీ ఏలూరు పార్లమెంటు సభ్యునిగా గెలిపించుకుంటే డబుల్ ఇంజన్ అభివృద్ధి సాధ్యమవుతుందని సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ అన్నారు. జబర్దస్త్ టీమ్, సినీ గాయకులతో కూడిన బృందం ఆదివారం కైకలూరు మండలంలోని పలు గ్రామాల్లో బిజెపి తరుపున ప్రచారం నిర్వహించి సందడి చేసింది. మండలంలోని భుజబలపట్నం, వరాహపట్నం, తామరకొల్లు, కైకలూరు పట్టణ పరిధిలో పర్యటించి ప్రధాని మోడీ చేస్తున్న అభివృద్ధి గురించి, 16 సంవత్సరాలుగా తపన ఫౌండేషన్ ద్వారా గారపాటి చౌదరి చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. జబర్దస్త్ కళాకారులు అదిరే అభి, అప్పారావు, బాబీ, వినోద్ (వినోదిని), ఇమ్మాన్యుయేల్ లు కామెడీ షోతో అలరించారు. సినీ గాయని గాయకులు లాస్య ప్రియ, అరుణ్ కౌండిన్య లు పాడిన పాటలు స్థానికులల్లో ఉత్సాహం నింపాయి. ప్రధాని మోడీ భారతదేశాన్ని అన్ని రంగాల్లో ప్రపంచ దేశాలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నారని ఆయనకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ అన్నారు. మోడీ పాలన,తపన చౌదరి సేవలు పైన పలు ప్రశ్నలు స్థానికులను అడిగి సమాధానం చెప్పిన వారికి బహుమతులు అందజేశారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వీక్షించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కిసాన్ మోచ జిల్లా అధ్యక్షులు కీర్తి రామ్ ప్రసాద్, మండల అధ్యక్షులు కట్ట వీర రాఘవులు, పెరుగు సత్యనారాయణ, వినయ్ వర్మ, నాగ సాయి, షేక్ బాషా,బి. బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## గుండె జబ్బులకు అత్యవసర వైద్యం అవసరం

**పాలకొల్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాబ్జి**





**భీమవరం, మేజర్‌న్యూస్:** పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, భీమవరం హాస్పిటల్స్ సంయుక్తంగా ఈ జిల్లా వాసులకు పూర్తి స్థాయి గుండె వైద్య సేవలు అందించడానికి ఆస్టర్ రమేష్ భీమవరం హాస్పిటల్స్, సెంటర్ ఫర్ కార్డియాక్ సైన్సెస్‌ను ఆదివారం ప్రారంభించారు. ప్రముఖ వైద్యులు, మాజీ శాసన సభ్యులు డాక్టర్ సత్యనారాయణ మూర్తి (బాబ్జి) చేతుల మీదుగా భీమవరం హాస్పిటల్స్ ప్రాంగణంలో గుండె వైద్య విభాగం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డాక్టర్ బాబీ మాట్లాడుతూ గుండె వైద్యంలో 35 సంవత్సరములుగా ఎంతో పేరెన్నికగన్న రమేష్ హాస్పిటల్స్ ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందించడానికి ముందుకు వచ్చినందుకు రమేష్ హాస్పిటల్స్, భీమవరం హాస్పిటల్స్ యాజమా న్యాలను అభినందించారు. రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు మాట్లాడుతూ గుండె జబ్బులలో వైద్యం అత్యవసరంగా అందవలసిన అవసరం ఎంతైనా ఉందని ప్రతి క్షణం ఎంతో అమూల్యమైనదని ఆలస్యం ప్రాణాంతకం కావచ్చని దీనిని దృష్టిలో ఉంచుకుని సువిశాల ప్రాంగణంలో, అత్యున్నత ప్రమాణాలతో వైద్యం అందిస్తున్న భీమవరం హాస్పిటల్స్ నందు పూర్తిస్థాయి గుండె వైద్య సేవలు లభ్యమయ్యేల ఏర్పాట్లు చేశామని తెలియచేశారు. ఇద్దరు కార్డియాలజిస్టులు, క్లినికల్ కార్డియాలజిస్టుల వైద్య బృందంతో యాంజియోగ్రామ్, స్టెంట్ యాంజియోప్లాస్టి,పేస్ మేకర్, హార్ట్ ఎటాక్, అన్ని గుండె సమస్యలకు అత్యవసర వైద్యం అందించే విధంగా ఇక్కడ ఏర్పాట్లు చేశామని తెలియచేశారు. భీమవరం హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణంరాజు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు అన్ని రకముల స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను ఒకే గొడుగు క్రింద అందించే ప్రయత్నంలో భాగంగా గుండె వైద్యాన్ని ఆ రంగంలో అపారమైన అనుభవం కలిగిన రమేష్ హాస్పిటల్స్ భాగస్వామ్యంతో నెలకొల్పామని 24 గంటలూ నిపుణులైన గుండె వైద్య బృందంతో అధునాతన వైద్య పరికరాలతో సేవలందిస్తామని తెలియచేసారు. భీమవరం హాస్పిటల్స్ ఎక్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ గోపాల రాజు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు గుండె వైద్య సేవలు అందించడానికి ముందుకు వచ్చిన డాక్టర్. పోతినేని రమేష్ బాబును అభినందిస్తూ ఈ రెండు వైద్య సంస్థల అపారమైన అనుభవం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలియచేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కార్డియాలజిస్టులు డాక్టర్ మహేష్, డాక్టర్ జి.వి.సత్యనారాయణ రాజు, రమేష్. హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి శ్రీనివాస రావు, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాయపాటి మమత, బిజినెస్ డెవలప్మెంట్ హెడ్ డాక్టర్ కార్తీక్ చౌదరి, పుర ప్రముఖులు మరియు డాక్టర్లు పాల్గొన్నారు.

## ఘంటసాల 50వ వర్ధంతి వేడుకలు



తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్: స్థానిక వీకర్స్ కాలనీ సెంటర్ నందుగల పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు గారి 50వ వర్ధంతి సందర్భంగా ఆయనకి ఘనంగా నివాళులు అర్పించారు. ఘంటసాల గానసభ అధ్యక్షుడు ఎస్ కాసిం నేతృత్వంలో ఈ కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక నాటక పరిషత్ సమాఖ్య అధ్యక్షులు బుద్ధాల వెంకట రామారావు, శిల్ప కళా ప్రపూర్ణ దేవికారాన్ని ఉడయార్, గానసభ కార్యదర్శి డి కృష్ణ, తబలా విద్వాన్ శంకర్రావు, డి బాలాజీ, ఎన్ ఎస్ ఆర్ మూర్తి, పవన్ ఆదిత్య, సిల్క్ సాహెబ్, ఈరోజు సన్మాన గ్రహీత పి టి వెంకన్న, ముఖ్యఅతిథి జి జి కే మూర్తి హైదరాబాద్, యువ గాయకుడు నజీరుద్దీన్, చిరంజీవి మన్సూర్, నాగూర్, సీరా కొండలరావు, రాంబాబు , కె బాబురావు తదితరులు పాల్గొన్నారు. గానసభ అధ్యక్షుడు కాసిం మాట్లాడుతూ ఘంటసాల ఎన్ని పాటలు పాడిన చివరిలో మనకి అందించిన భగవద్గీత అజరామరం అని భగవద్గీతను పిల్లలకు నేర్పించినట్లయితే ఒక శాస్త్రీయ సంగీతం అందించినట్లే ఘంటసాల అన్ని రాగాలని తేలికగా అందరూ నేర్చుకునే విధంగా భగవద్గీతను స్వరపరిచారని కొనియాడారు. బుద్దాల రామారావు మాట్లాడుతూ ఘంటసాల కీర్తి వేరే ఏ గాయకుడికి లేదని ఘంటసాలకి ఊరు రా విగ్రహాలు పెట్టి ఆరాధన చేయడం చనిపోయి 50 సంవత్సరాలు అయినా ఈనాటికి ఆయన పాటలు సజీవంగా ఉన్నాయని కొనియాడారు. ఉడయార్ మాట్లాడుతూ ఘంటసాల కీర్తి సూర్యచంద్రులు ఉన్నంతకాలం ఉంటుందని తెలుగు భాషకి ఘంటసాల స్వరం ఒక వరం అని కొనియాడారు. జి జి కే మూర్తి మాట్లాడుతూ తాను ఈ సభకి మూడు దశాబ్దాలుగా వస్తున్నానని ఈ సభ 50వ సంవత్సరానికి కూడా రావాలి అని భగవంతుడు మీ అందరికీ నాక్కూడా ఆయురారోగ్యాలు ఇవ్వాలని ప్రార్థిస్తున్నాను అని కొనియాడారు.